# నాగరికత నీడలలో...

సాయంత్రం ఆరుగంటల సమయం. సునీత అద్దం ముందు నిలబడి వుంది. అప్పటికి పావుగంట నుంచీ అలాగే చలనంలేని బొమ్మలా, కదలికలేని శిల్పంలా, కళ్ళ నుండి నీటిబిందువులు మాత్రం ముత్యాల్లా చెంపల మీదికి జారుతున్నాయి.

అలా ఎంతసేపు నిల్చుందో?

"సునీతా పార్టీకి టైమవుతోంది తయారవు!" క్రిందనుంచి తల్లి సరళాదేవి కేక విన్పించింది. సునీత వులిక్కిపడి కళ్ళు తుడుచుకుంది.

అవును. పార్టీకి టైమవుతోంది. బలిపశువులా అలంకరించుకొని బలిపీఠం ఎక్కాలి. తల్లి పార్టీకోసం ఎంచిపెట్టిన బట్టల్లా కన్పించలేదు. తనవంటికి చుట్టుకోబోయే పాముల్లా కన్పించాయి. చటుక్కున వాటిని మళ్ళీ మంచంమీదే పడేసింది!

బాగా లోనెక్ పెట్టి కుట్టిన షర్టు. టైట్‌ప్యాంటు. ఎక్కడికక్కడ తన శరీరంలోని ఒంపుల్ని బయటపెట్టే దేవతా వస్త్రాలు.

అవి వేసుకుంటే బట్టలు వేసుకున్నట్లు వుండదు. తన శరీరాన్ని నగ్నంగా నిలబెట్టినట్లుంటుంది. అటువంటి బట్టలు వేసుకుని పార్టీకి, అందులోనూ గోపాల్ బర్త్‌డే పార్టీకి వెళ్ళడమా?

ఉహూ! తనవల్లకాదు. తను వెళ్ళలేదు. నల్లగా హిప్పీ క్రాపులో ఎలుగుబంటిలా వుండే ఆ గోపాల్ చూపులు ఎప్పుడూ తన గుండెల మీదే ఉంటాయి.

ఒక్క గోపాల్ అనేకాదు, తన కాలేజీలోని ప్రతి కుర్రాడి చూపులూ అలాగే వుంటాయి. తనవైపు చూసే వాళ్ళ కళ్ళల్లో ఆకలి, కోరిక. అవి తనని నిలువునా చీలుస్తున్నట్లుంటాయి. మళ్ళీ వాళ్ళు అందరి ఆడపిల్లలతోనూ అలాగే వుంటారా! అంటే వుండరు.

తన ఫ్రెండు సీతతో మళ్ళీ బాగానే వుంటారు. తన దగ్గరికి వచ్చేసరికే ఎక్కడలేని వెకిలితనం వస్తుంది వాళ్ళకి.

దానిక్కారణం తనకి మొదట్లో తెలీలేదు. చాలారోజులు ఆలోచించగా తట్టింది. సీత లంగా, ఓణీలో ముద్దుగా ముద్దబంతి పూవులా వుంటుంది.

బహుశ అందుకేనేమో

సీతంటే వాళ్ళకి అంత గౌరవం!

నిన్న సాయంత్రం తనూ, సీతా కాలేజీ వదిలాక ఇంటికి నడిచి వస్తున్నారు. నిన్న తను మినీస్కర్టు ఆపైన షర్టు వేసుకుంది. తన వెనకాలే రవి, శేఖర్ వస్తున్నారు. వాళ్ళెప్పుడూ అలా తమవెంట బాడీగార్డుల్లా వస్తూనే వుంటారు. తనని చూసి ఎలకమీదో, పిల్లిమీదో పెట్టి కామెంట్స్ పాస్ చేస్తారు.

వాటికి తను అలవాటుపడిపోయింది.

కాని నిన్న రవి రోజులా కాక, డైరెక్టుగా తనమీద పాటలు ప్రారంభించాడు.

'ఆ నడకలు చూస్తే మతిపోతుంది' అంటూ మొదలుపెట్టాడు.

'నడకలు కాదురా చిట్టి తండ్రీ! ఆ గుండెలు చూస్తుంటే ప్రాణాలే పోతున్నాయి'' అన్నాడు శేఖర్ పాటలా పాడుతూ. శేఖర్ పాటవిని రోడ్డు మీద పోతున్న ఎవరో కుర్రాడు తనను చూసి కిసుక్కున నవ్వాడు.

ఆ క్షణంలో భూమి బ్రద్దలయి తనని దాచుకుంటే బాగుండు నన్పించింది. ఆ కుర్రాడు నవ్వటంతో వాళ్ళు మరీ రెచ్చిపోయారు. నోటికివచ్చిన పాటలు పాడటం ప్రారంభించారు, తనకి స్పృహ తప్పినట్లయింది. సీత తన స్థితి గమనించి ప్రక్కనపోతున్న రిక్షాని పిలిచి తనని కూర్చోపెట్టి ఇంటికి చేర్చింది.

రాత్రే నిశ్చయించుకుంది ఇంకెప్పుడూ అటువంటి డ్రెస్ వేసుకోకూడదని. కాని తనొక్కత్తే నిశ్చయించుకుంటే సరిపోదు, తనెప్పుడు ఏ డ్రెస్ వేసుకోవాలో నిర్ణయించేది అమ్మ. అమ్మ ఒప్పుకోవాలి.

అందుకే పొద్దుటి నుంచీ అమ్మతో ఈ విషయం ఎలా చెప్పడమా! అని ఆలోచిస్తోంది. అమ్మతో ఏం మాట్లాడదామన్నా భయమే. అమ్మ ఒక్కరోజన్నా తనని ఆప్యాయంగా దగ్గరికి పిలవదు! ప్రేమతో పలకరించదు.

ఎందుకనో ఎప్పుడూ అలా అంటీ అంటనట్లుంటుంది.

"సునీ ఏమిటి అలా నిలబడ్డావ్! తొందరగా తయారవ్! నిన్ను గోపాల్ ఇంట్లో దింపి నేను క్లబ్బుకి పోతాను.''

ఎప్పుడు వచ్చిందో బీరువాకి తాళం వేస్తూ అంటోంది సరళాదేవి. సునీత తల్లివేపు చూసింది. ఆవిడ తాళం చెవులు తీసుకుని వెనుదిరిగింది. సునీత కంగారు పడింది అమ్మ వెళ్ళిపోతుంది, ఈ అవకాశం జారిపోతే తను ఇక చెప్పలేదు. ఎలాగో గొంతు పెగల్చుకుని

'అమ్మా' అని అనబోయింది.

ఇంతలో చటుక్కున అలా పిలిస్తే తల్లికి కోపమని 'మమ్మీ' అంది, సరళాదేవి వెనక్కి తిరిగింది.

"మమ్మీ నాకీ బట్టలు వద్దు" అంది.

"ఏం! పోనీ మాక్సీ వేసుకుంటావా"

"ఊహూ! అవేం వేసుకోను"

"మరింకేం వేసుకుంటావే"

"మొన్నా మధ్య అమ్మమ్మ కుట్టించిందే లంగా ఓణీ అవి వేసుకుంటా" భయం భయంగా అంది. ఆ మాటలు వింటూనే సరళాదేవి ముఖం కోపంతో ఎర్రబడింది.

"ఏమిటి! ఆ గంగిరెద్దు వేషమా! నువ్వెళ్ళేది సంతకి కాదు పార్టీకి. ఆ అమ్మవారి వేషం వేసుకుని పార్టీకి వెడితే నిన్ను కాదు, ముందు నా ముఖాన నవ్వుతారు తెలుసా" కోపంగా అంది.

తల్లి మెల్లగా కారణం అడిగితే నిన్న జరిగిన సంఘటన గూర్చి చెప్పాలనుకుంది. తల్లి కోపం చూసి అసలు నోటిమాట రాలేదు. కాని తనిప్పుడు ఏ మాత్రం వెనుకాడినా మళ్ళీ ఆ బట్టలే వేసుకోవాల్సి వస్తుంది. తల్లి కోపమన్నా భరించవచ్చుగాని ఆ బట్టల్ని మాత్రం వేసుకోలేదు.

"అది కాదు మమ్మీ ఆరోజు నా డ్రెస్ చూసి గోపాల్ ... ..." క్రిందటి సారి పార్టీలో జరిగిన సంఘటన జ్ఞప్తికి తెచ్చుకుంటూ అన్నది సునీత.

సరళాదేవి సునీత మాట పూర్తవకుండానే అందుకుంది.

"ఏవన్నాడు? నువ్వా బట్టల్లో చాలా బాగావున్నావన్నాడు. అది నీకు కాంప్లిమెంటే కదా! కల్చర్డ్‌మేన్ కాబట్టి చక్కగా చెప్పాడు?"

ఆ మాటలు వింటోంటే సునీతకి నవ్వాలో ఏడ్వాలో తోచలేదు. తల్లి ఎదుట కూతురి అందాన్ని గూర్చి కామెంట్ చేసే గోపాల్ కల్చర్ మేనా? ఆ తర్వాత పార్టీలో ఎంత అసహ్యంగా ప్రవర్తించాడు? తన చేయి పుచ్చుకుని దగ్గరకు లాక్కుని... అప్రయత్నంగా సునీత చేతులు గుండెల మీదకు వెళ్ళాయి.

అవన్నీ ఎవరితోనన్నా చెప్పుకోవాలని వుంటుంది. తనకెవరున్నారు! ఎవరితో చెప్పేది? తల్లికి తన సంగతే అఖ్ఖర్లేదు. ఫ్రెండ్స్‌తో చెప్తే చులకన. సీత కాలేజీలో ఏది జరిగినా తల్లితో చెప్తుందట. ఆవిడ అన్నీ జాగ్రత్తగా విని తగిన సలహాలిస్తుందట.

"కానీ తనకు ఆ అదృష్టం ఏది?"

"సునీ! పిచ్చి పిచ్చి ఆలోచన్లు మాని ఆ బట్టలేసుకో. నువ్వేం వేసుకోవాలో ఎలా వుండాలో నాకు తెలుసు. అయిదు నిమిషాల్లో తయారయి కిందకురా" అంటూ ఆజ్ఞ జారిచేసి విసవిసా నడుచుకుంటూ కిందికి వెళ్ళింది సరళాదేవి.

చేసేదిలేక సునీత ఏడుస్తూనే మంచం మీది బట్టల్ని చేతిలోకి తీసుకుంది!

* * *

గోపాల్ ఇల్లు లైట్ల వెలుగులో పట్టపగల్లా వుంది.

సరళాదేవి సునీతని గేటు దగ్గిర దింపి -

"సునీతా! నేను వెడుతున్నా పార్టీ అవగానే ఏ టాక్సీలోనైనా వచ్చేయ్" అంటూ కారు స్టార్టు చేసుకుని వెళ్లిపోయింది.

సునీత కారు కనుమరుగయ్యే వరకూ చూస్తూ నిలబడింది. ఆ తర్వాత సునీత నెమ్మదిగా గేటు తీసుకుని పులిబోనులోకి అడుగిడుతున్న మేక పిల్లలా మెల్లగా లోపలకెళ్ళింది.

మెట్లెక్కి వస్తున్న సునీతని చూసి గోపాల్ గుమ్మం దగ్గరికి ఎదురొచ్చి -

'రా సునీ!' అన్నాడు.

ఏదో ఆలోచిస్తూ వస్తున్న సునీత ఆమాటకి చటుక్కున నిలబడిపోయింది. గుమ్మానికి అటు గోపాల్ ఇటు సునీత.

గోపాల్ చూపులు సునీతని నిలువెల్లా పరీక్షిస్తున్నాయి.

గులాబీరంగు డ్రెస్, బాబ్డ్‌హెయిర్, ఎడమచేతికి వాచీ, కుడిచేతిలో హ్యాండ్ బ్యాగ్.

సునీతను ఆ అలంకరణలో చూస్తునే "హే! బ్యూటిఫుల్" సంతోషంగా అన్నాడు గోపాల్.

ఆ మాటకి సునీత ఒళ్ళు భగ్గునమండింది. ఆ క్షణాన అక్కడ నుంచి పారిపోవాలన్పించింది. ఇదే రోడ్డు మీది వ్యక్తి ఎవరైనా అని వుంటే అతన్నప్పుడు నిలబెట్టి ఆ చెంపా, ఈ చెంపా వాయించేది. కాని ఇక్కడ అటువంటి మాటలకు నవ్వాలి. తననే కదా పొగిడాడని గర్వపడాలి. సిగ్గుతో మెలికలు తిరుగుతూ "థాంక్యూ" అనాలి. ఇవి ఈ సొసైటి లక్షణాలు. అమ్మ తనకి ప్రతిరోజూ నూరిపోసే పాఠాలు ఇవి!

'అక్కడే నిలబడి పోయావే లోపలికి రా' అన్నాడు మళ్లీ గోపాల్.

సునీత గోపాల్ వెనకే వెళ్ళింది. హాల్లో సోఫాల్లో రకరకాల మనుషులు స్టీరియోలో వస్తున్న విదేశ సంగీతానికి అనుగుణంగా తలలూపుతున్నారు. అందరి చేతుల్లోనూ గాజుగ్లాసులున్నాయి. వాటిల్లో ఎర్రటి ద్రవం.

సునీత వాళ్ళ వేపు చూసింది. తనకు తెలిసిన వారెవరూ అక్కడలరు!

ఎప్పుడైనా పార్టీకి వచ్చినా అమ్మ ప్రక్కనే వుండేది. అమ్మ అందరితో మాట్లాడుతుంటే తను అమ్మ ప్రక్కనే తలొంచుకుని కూర్చునేది.

'అలా కూర్చో' అన్నాడు గోపాల్ సునీతకి కుర్చీ చూపుతూ.

అందరి కళ్ళూ సునీతవైపే తిరిగాయి సునీత సిగ్గుతో ముడుచుకుని కూర్చుంది. గోపాల్ డ్రింక్ గ్లాసు అందిస్తూ....

"నేను సాఫ్ట్ డ్రింక్ ఇస్తున్నాను తీసుకో" అన్నాడు.

సునీత ఏదో చెప్పబోయింది. ఇంతలో గోపాల్‌ని ఎవరో పిలవడంతో గ్లాసు సునీతకిచ్చి అటు వెళ్లాడు.

హాల్లో ట్యూబ్‌లైట్లు ఆరి డిమ్‌లైట్లు వెలిగాయి. స్టీరియోలోని మ్యూజిక్ రాను రాను తీవ్రస్థాయిలో వస్తోంది. అక్కడున్న వారందరికీ మందు ఎక్కువయినట్లుంది పడిపోతున్నారు.

గోపాల్ దూరంగా సోఫాలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కాని అతని మనసూ, చూపులూ అన్నీ సునీత మీదే వున్నాయి.

బ్లూలైట్‌లో పల్చటీ గులాబీ రంగు డ్రెస్‌లో బంగారు ఛాయతో మెరిసిపోయే సునీత అప్పుడే పుష్పించిన గులాబీలా వుంది.

సునీత వంగి గ్లాసు కింద పెట్టింది. ఎత్తుపల్లాలు తళుక్కుమని మెరిశాయి. ఆదృశ్యం చూడగానే గోపాల్ వళ్ళు వేడెక్కింది. పల్చటి టైటుప్యాంటులోంచి ఊరిస్తున్న అందాలు, పల్చటి షర్టులోంచి కన్పిస్తున్న వంపులు గోపాల్ శరీరంలోని టెంపరేచర్‌ని ఒక్కొక్క డిగ్రీ ఎక్కువ చేయసాగాయి.

ఎన్నాళ్ళనుంచో సునీతని ఒంటరిగా కలుసుకోవాలని అతని కోరిక. ఎప్పుడూ బాడీగార్డులా అమ్మని వెంటేసుకు వచ్చేది. ఈరోజు వంటరిగా చిక్కింది.

ఈ అవకాశాన్ని జారవిడువకూడదు. కడుపులోకి వెళ్ళిన ఘాటైన మందు శరీరాన్ని తొందరపెట్తోంది. స్టీరియోలో నుంచి వస్తున్న సంగీతం మనసుని ఉద్రేక పరుస్తోంది. సోఫాల్లో కూర్చున్న వాళ్ళు ఒక్కొక్కరే లేచి జంటల్ని వెతుక్కుని నాట్యం చేస్తున్నారు.

గోపాల్ లేచి సునీత దగ్గరికి వచ్చాడు. సునీత ప్రక్కనే నిలబడి ఆమెవైపు చూశాడు.

సునీత కళ్లెత్తి అతనివైపు చూసింది. తెల్లని డ్రెస్‌లో నల్లటి గోపాల్ మరీ భయంకరముగా కన్పించాడు. వణికిపోయింది. సన్నగా వణుకుతున్న సునీతని చూసి ఒళ్ళు మర్చిపోయాడు గోపాల్.

అతనికి ప్రపంచం ఏమీ కన్పించడం లేదు. ఒక్క సునీతే కన్పిస్తోంది. ఆ అందమైన పెదవుల్ని కొరికేయాలన్పిస్తోంది. ఆ పల్చటి డ్రెస్‌లోంచి కన్పిస్తున్న పచ్చటి శరీరాన్ని చేత్తో తడమాలనిపిస్తోంది.

"సునీతా! మనం కూడా డ్యాన్స్ చేద్దాం రా!" అంటూ చెయ్యి పట్టుకుని లేవదీశాడు.

సునీతకి ఏం చెప్పాలో, ఎలా వద్దనాలో తోచలేదు.

ఇటువంటి డ్యాన్సులూ, తాగుళ్ళూ వుంటాయనే తనకీ పార్టీలంటే చెడ్డ అసహ్యం. కాని అమ్మ ఇటువంటి పార్టీలకెడితే లోకజ్ఞానం కలుగుతుంది అంటుంది. ఆ కలిగే జ్ఞానమేమిటో తనకి అర్థంకాలేదు

సునీత ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే గోపాల్ హాల్ మధ్యకు లాక్కెళ్లాడు. సునీత నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకున్నాడు. గోపాల్ వెచ్చని వూపిరి సునీతకి నిప్పు సెగలా తగుల్తోంది.

సునీత ముఖం దగ్గిరగా గోపాల్ ముఖం, సునీత మెత్తని వంటి మీద గోపాల్ చెయ్యి కదుల్తూంటే సునీతకి గొంగళి పురుగు పాకినట్లుగా వుంది.

ఆమెకి నిలువెల్లా చెమటలు పట్టాయి.

గోపాల్ చేతుల్ని తప్పించుకుని పారిపోవాలన్పిస్తోంది. శరీరం వణికిపోతూంది; కళ్ళు తిరుగుతున్నట్లుగా వుంది.

ఎవరైనా వచ్చి రక్షిస్తే బాగుండును.

ఎవరు వస్తారు? ఎవరు రక్షిస్తారు?

అమ్మ! అమ్మే రావాలి.

"అమ్మా! నన్ను రక్షించమ్మా. ఈ గోపాల్ నన్నేదో చేస్తున్నాడు. నాకు భయంగా వుంది అసహ్యంగా వుంది అని సునీత మనస్సు ఆక్రోసిస్తోంది.

గోపాల్ ఇవేమీ పట్టించుకోవడం లేదు, హఠాత్తుగా సునీతను తన రెండు చేతులతో బలంగా పట్టుకుని గబగబా మేడ మీద గదిలోకి తీసుకెళ్లాడు.

* * *

జిల్లా జడ్జీ కోర్టు ముందు జనం ఇసకవేస్తే రాలనట్లున్నారు. "బిజినెస్ మాగ్నెట్ రావుగారి కుమార్తె సునీత హత్య చేయబడింది. అది మామూలు హత్య కాదు రేప్ చేయబడింది. ఆ షాక్‌లోనే ఆమె ప్రాణాలు పోయాయి. ఆమెని రేప్ చేసిన గోపాల్ తనంతట తానే పోలీసులకు పట్టుబడ్డాడు."

స్థానిక పత్రికలో ప్రచురింపబడిన ఈ వార్త వూళ్లో సంచలనాన్ని కలిగించింది.

ఆ రోజే కేసు విచారణ అని తెలిసి వేరంతా తరలి వచ్చారు.

సరళాదేవి శవాకారంలా తయారయింది. ఆవిడ దుఃఖం పట్ట శక్యం కాకుండా వుంది.

గోపాల్ అయితే పిచ్చివాడిలా వున్నాడు బాగా ఏడ్చాడేమో ముఖమూ కళ్లు వుబ్బి వున్నాయి జడ్జి ముందు బోనులో తలవంచుకుని నిలబడ్డాడు. గోపాల్ చేత ప్రమాణం చేయించి విచారణ ప్రారంభమైంది. జడ్జి గోపాల్‌ని ప్రశ్నిస్తున్నారు.

"నీ పేరేమిటి?"

"గోపాల్" గోపాల్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఏడవతారీఖు సాయంత్రం ఏం జరిగిందో చెప్పు" గోపాల్ గొంతు సవరించుకొన్నాడు.

"సార్! ఆ సాయంత్రం జరిగింది చెప్పాలంటే దానికి ముందు కొంత విషయం చెప్పాలిసి వుంటుంది వినండి! సునీత మా కాలేజీలో ఇంటర్ చదువుతోంది సునీత మొదటిసారిగా మా కాలేజీలో అడుగుపెట్టిన రోజు నాకింకా జ్ఞాపకం వుంది. ఆ రోజు మినీ స్కర్టు పైన షర్టు వేసుకుంది. ఆ డ్రెస్‌లో ఆమెని చూసి షాక్ తిన్నాను. అసలే బొద్దుగా వుండే సునీత ఆ బట్టల్లో చాలా సెక్సీగా కనబడింది. ఆ తర్వాత ఎప్పుడు చూసినా టైట్ ప్యాంటో పల్చటి మాక్సినో, జీన్సో వేసుకునేది. సగం వళ్ళు కన్పిస్తూ ఆమె కాలేజీలో తిరుగుతూంటే ఆమెని చూసి పిచ్చివాళ్ళయిన వాళ్ళు మా కాలేజీలో చాలా మందే వున్నారు. సునీతని చూస్తూ తట్టుకోవడం నాకు శక్యం కాకుండా వుండేది.

ఆమె ఎప్పుడైనా పార్టీలకి వచ్చినా తల్లితో కలిసివచ్చేది. ఆమె ఒంటరిగా దొరికితే బాగుండు అనుకుంటూ వుండేవాడిని.

నా అదృష్టమో దురదృష్టమో మా ఇంటికి నా బర్త్‌డే పార్టీకి ఒంటరిగా వచ్చింది. ఆమె ఆరోజు వేసుకున్న డ్రెస్ పల్చటి గులాబీరంగు ప్యాంట్, షర్టు. ఆమె బట్టలు వేసుకున్నా వేసుకోనట్లే అన్పించింది. దానికి తోడు నేను తాగిన డ్రింక్, ఆ వాతావరణం నన్ను రెచ్చగొట్టాయి. ఇక నన్ను నేను కంట్రోల్ చేసుకోలేక పోయాను. గోపాల్ కళ్ళ నుండి నీళ్ళు టపటపా రాలాయి!

"సార్! నేను చాలా ఘోరం చేశాను. రాక్షసుడిలా ప్రవర్తించాను ఒక నిండు ప్రాణాన్ని బలి తీసాను. నాకు వురిశిక్ష తప్ప వేరే వెయ్యకండి. నాలాంటి కామాంధుడు బ్రతికుండకూడదు." ముఖం రెండు చేతుల్లో కప్పుకుని ఏడ్వసాగాడు.

అతని ఏడ్పు అక్కడున్న వాళ్ళ గుండెల్ని ద్రవింపచేస్తోంది.

ప్రేక్షకుల్లో కూర్చున్న సరళాదేవి గబుక్కున లేచి గోపాల్ నుంచున్న బోను దగ్గరికి వచ్చి నుంచుంది.

"యువరానర్! ఇలా మధ్యలో వచ్చినందుకు క్షమించండి ఇందులో నా తప్పు కూడా వుంది కాబట్టి చెప్పటానికి రావాల్సి వచ్చింది. గోపాల్ సునీత వేసుకున్న డ్రెస్ తనని రెచ్చగొట్టిందన్నాడు. అదే నిజమైతే అలా ఆమె చేత ఆ బట్టలు వేయించింది నేను. నా కూతురు మోడ్రన్ డ్రెస్‌తో సొసైటీలో తిరగాలి అందరూ మాది కల్చర్డ్‌ఫామిలీ అనాలి. నలుగురిలో నాగరికంగా కన్పించాలి, నలుగురు నా టేస్ట్‌కి మెచ్చుకోవాలి అని అనుకుంటూ నా కూతురికి యిష్టంలేక పోయినా దాన్ని అలా తయారుచేసింది నేను.

ఇలా తయారు చేయడానికి ఇంకో కారణం కూడా వుంది సునీత లంగా వోణి వేసుకుంటే పెద్దదిలా కన్పిస్తుంది. అప్పుడు నా వయస్సూ పెరుగుతుంది.

ఇలా ఆలోచించి దాని బ్రతుకుని నాశనం చేశాను సునీతకి పేరుకి నేను తల్లినేకాని, ఆమె బాగోగును పట్టించు కోలేదు నా పొరపాటుకి నా కూతురి నిండు జీవితం బలైంది నాకు వెయ్యాలి. వురిశిక్ష అవును నాకే వెయ్యండి నాకే వెయ్యండి.''

పిచ్చిదానిలా అరవసాగింది సరళాదేవి.

రావుగారు భార్యని ఇవతలికి తీసుకొచ్చి కూర్చుబెట్టారు. కాని సరళాదేవి కుళ్లీ కుళ్లీ ఏడుస్తూనే వుంది.

"ఆధునిక నాగరికత ఎంత పని చేసిందో చూశారా. ఒక వ్యక్తిగా బాధ్యత గల తండ్రిగా చూస్తోంటే ఈ సంఘటన నన్ను కదిలించి వేస్తోంది. కాని నేను న్యాయాధికారిని కనుక తీర్పు ఇవ్వాలి శిక్ష వెయ్యాలి కాని ఎవరికి వెయ్యాలి? పెద్దవాళ్లు అదుపాజ్ఞల్లో పెట్టకపోవడం వలన యిష్టమెచ్చినట్లే తిరుగుతు క్షణిక వ్యామోహానికి లోనై రేప్ చేసిన గోపాల్‌కా?

నాగరికత, అభ్యుదయం పేరుతో అర్థం లేని విధంగా అలంకరణ చేసుకుని అతడిని రెచ్చగొట్టిన సునీతకా!

సమాజంలో నాగరికంగా కన్పించాలని, నేడు వస్తున్న ఫ్యాషన్‌లో అందరికన్నా ముందుండాలని లేనిపోని వ్యామోహాలకు లోనై సునీతచేత అలా డ్రెస్ వేయించిన సరళాదేవికా!

నాగరికత పేరున విశృంఖల విహారం చేస్తున్న ఈ సంఘానికా!''

ఇవి జడ్జిగారి తీవ్రమైన ఆలోచనలు! తను తీర్పు చెప్పాలి.

అవును!

ఎవరికి ఏ విధంగా? ఎలా తీర్పు చెప్పాలి!

ఎలా చెప్పినా తీర్పు చెప్పక తప్పదు!

జడ్జీగారు తీర్పు కాగితాలు తీసుకుని చదవటానికి వుద్యుక్తులవుతున్నారు.

ఇంతలో కోర్టులో ......

సరళాదేవి పెద్ద ఆర్తనాదం చేస్తూ స్పృహ తప్పి పడిపోయింది.

కోర్టులో జనమంతా లేచి అటు పరుగెత్తారు.

జడ్జిగారు తీర్పును రేపటికి వాయిదా వేసి న్యాయస్థానం నుండి లేచారు